క్లుప్తంగా

రైతు బజారు ఏర్పాటు చేయాలి



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు మొక్కను అందిస్తున్న ఏఎంసీ చైర్మన్ చిరంజీవి

ఏలూరు(మెట్రో): స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నెర్సు చిరంజీవి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేశారు. ఏలూరు త్రీ టౌన్ పరిధిలో ఉన్న టీటీడీ కళ్యాణ మండపం సమీపంలో రైతు బజారు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్టు చిరంజీవి తెలిపారు. మార్కెట్ యార్డ్ సమస్యలపై చర్చించామన్నారు. చిరంజీవి వెంట నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, ఏఎంసీ వైస్ చైర్మన్ కాంచన రామకృష్ణ ఉన్నారు.

ఆనంద్‌కు జాషువా పురస్కారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆదికవి నన్నయ యూనివర్సిటీ పీఆర్వో పువ్వల ఆనంద్‌కు నవ యుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 128వ జయంతిని పురస్కరించుకొని జాషువా సాహితీ పురస్కారాన్ని ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఈ మేరకు సొసైటీ వ్యవస్థాపకుడు అద్దంకి రాజా యోనా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28న ఏలూరులో జరిగే జాషువా జయంతి కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి చేతులమీదగా పురస్కారాన్ని అందించనున్నట్టు తెలిపారు. ఆనంద్ సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు వివరించారు.

జగనన్న కాలనీల్లో పూర్తిస్థాయిలో వసతులు

పెదవేగి : జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టామని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు పి.విజయబాబు చెప్పారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నూరుశాతం పూర్తి చేయాలన్నారు. వచ్చే నవంబరు నెలాకరునాటికి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తికావాలని, ఈ విషయంలో అధికారులు, లబ్ధిదారులను చైతన్యపర్చాలని ఆయన సూచించారు. కాలనీల్లో అవసరమైన తాగునీరు, రహదారులు, విద్యుత్ లైన్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ సమావేశంలో పెదవేగి ఎంపీపీ తాతా రమ్య, ఎంపీడీవో జి.రాజమనోజ్, గృహ నిర్మాణశాఖ ఏఈ నాగరాజు, విజయరాయి, పెదవేగి, ముండూరు సొసైటీ అధ్యక్షుడు పాలడుగు సత్యనారాయణ, పెనుమాక వెంకట సుబ్బారావు, చెరుకూరి ప్రసాదరావు, సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్, వైసీపీ నాయకులు గుత్తా ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు జానంపేట బాబు, తాతా సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమడోలు: మండలంలో ఖాళీగా ఉన్న 4 గ్రామ వలంటీర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి అన్నారు. భీమడోలులో మంగళవారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేసారు. మండలంలోని అంబర్‌పేటలో 2, పోలసానిపల్లి, సూరప్పగూడెం గ్రామాల్లో ఒకొక్కటి చొప్పున రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అంబర్‌పేటలోని రెండు పోస్టుల్లో బీసీఏ (జనరల్), బీసీ బీ (జనరల్), పోలసానిపల్లిలో పోస్టును ఓసీ జనరల్‌కు, సూరప్పగూడెంలోని పోస్టును బీసీఏ జనరల్‌కు కేటాయించినట్లు ఆమె పేర్కొన్నారు. పదో తరగతి పాసై ఉండాలని, 18 ఏళ్ల నిండి 35 ఏళ్ల నిండాలన్నారు. ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్టోబర్ 4న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- 820 మందికి రూ.2.50 కోట్ల రుణాలు
- రూ.35.66 లక్షల యంత్రాల సబ్సిడీ
- డ్రోన్, యంత్రాల ఉపయోగంపై శిక్షణ
- మండలంలో 7762 ఎకరాల్లో వరిసాగు



మల్కాపురంలో డ్రోన్ ఉపయోగాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)



మల్కాపురంలో పెస్టిసైడ్స్ పిచికారీ చేస్తున్న డ్రోన్ (ఫైల్)

ఏలూరు రూరల్: రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. యాంత్రీకరణతో వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కించడంతో పాటు వైఎస్సార్ రైతు భరోసా, కౌలురైతు గుర్తింపు కార్డులు, పంట రుణాలు అందించి సాగుకు సాయం చేసింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఏలూరు మండలం మల్కాపురం, వెంకటాపురం, మాదేపల్లి, పోణంగి, జాలిపూడి, చాటపర్రు, కాట్లంపూడి, లింగారావుగూడెం, కోటేశ్వరదుర్గాపురం, చొదిమెళ్లలో రైతులు 7,762 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

రూ 2.50 కోట్ల రుణాలు

ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల వ్యవసాయ అధికారులు గ్రామాల్లో కౌలుదారులను గుర్తించారు. 2,226 మంది రైతులకు హక్కుపత్రాలు (సీసీఆర్‌సీ) అందించారు. గత ఏడాది కంటే మరో 265 మందికి పత్రాలు అందించారు. వీరిలో 820 మంది రైతులకు ప్రభుత్వ హామీతో పలు బ్యాంకుల ద్వారా రూ.2.50 కోట్ల పంట రుణాలు అందించారు. ఇప్పటికే వైఎస్సార్ రైతు భరోసా పథకంతో ఏలూరు మండలంలో 2,200 మంది రైతుల వ్యక్తిగత ఖాతాల్లో రూ.2.07 కోట్లు జమ చేసిన సంగతి తెలిసిందే.

రూ.35.66 లక్షల సబ్సిడీ

వ్యవసాయ యాంత్రీకరణ పేరుతో అధికారులు రైతులను సంఘాలుగా ఏర్పాటుచేసి పలు రకాల యంత్రాలను సబ్సిడీపై అందించారు. 2021-22, 2022-23 సంవత్సర కాలంలో 12 గ్రూపుల్లో పదుల సంఖ్యలో రైతులు రూ.35.66 లక్షలు సబ్సిడీ పొందారు. ఇందులో ట్రాక్టర్లు, పిచికారీ యంత్రాలు, టార్పాలిన్లు ఉన్నాయి.

సబ్సిడీపై విత్తనాలు

ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా 90 క్వింటాల నాణ్యమైన వరి విత్తనాలు అందించింది. ఇందులో కేజీకి రూ.5 చొప్పున రైతులు సబ్సిడీ పొందారు. ఇందులో 1061, 1318, స్వర్ణ రకాల విత్తనాలు ఉన్నాయి. 133 మంది రైతులు రూ.11.81 లక్షల విత్తనాలు కొనుగోలు చేశారు. రూ.లక్షల సబ్సిడీ పొందారు.

ఎకరానికి 40 బస్తాల దిగుబడి



రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయానికి మంచిగా సాయం చేస్తోంది. కౌలురైతు కార్డులు మాకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఖరీఫ్‌కు పుష్కలంగా నీరు అందించింది. విత్తనాలు ఇచ్చింది. అవసరమైతే ఎరువులూ తెచ్చుకుంటాం. ఎకరానికి 40 నుంచి 45 బస్తాలు దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాం.

– జి.దుర్గారావు, రైతు, చాటపర్రు

యాంత్రీకరణపై అవగాహన



వ్యవసాయ యాంత్రీకరణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. డ్రోన్ ద్వారా పెస్టిసైడ్స్ ఉపయోగంపై ఇటీవల శిక్షణ ఇచ్చాం. ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై యంత్రాలు, బ్యాంకుల నుంచి రుణాలు అందించాం. ఈ ఖరీఫ్‌లో 7,762 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. 110 మెట్రిక్ టన్నులు ఎరువులు సిద్ధం చేశాం.

– ఎ.జీవనసంధ్య, ఎంఏఓ

నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గణేశ్ నిమజ్జనాల సందర్భంగా స్థానిక ఒన్‌టౌన్ ప్రాంతంలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు టి.శశిధర్ పేర్కొన్నారు. కోటదిబ్బ సబ్ స్టేషన్, వెంకన్న ట్యాంక్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 11 గంటల వరకు కోటదిబ్బ, మెయిన్ బజార్, పాండురంగ థియేటర్, అగ్రహారం, మార్కెట్, కెనాల్ రోడ్, సత్యనారాయణ పేట, లంబాడి పేట, వెన్నవల్లి వారి పేట,బావిశెట్టి వారి, నల్ల దిబ్బ, వెంకన్న ట్యాంక్ సబ్ స్టేషన్ పరిధిలో జ్వాల పరమేశ్వర కాలనీ, పడమర వీధి, శనగపప్పు బజార్, లోయ దిబ్బ, చిరంజీవి బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో మూడో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడిందని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కన్వీనర్ కోటాలో ప్రవేశం పొందిన విద్యార్థులకు మాత్రమే జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వంటి సదుపాయాలకు అర్హత ఉంటుందని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు.

వృద్ధురాలు అనుమానాస్పద మృతి

- మూడు నెలల క్రితమే మృతి?
- కొడుకును విచారిస్తున్న పోలీసులు



నాగలక్ష్మి (ఫైల్)



నాగలక్ష్మి మృతిపై వివరాలు సేకరిస్తున్న పోలీసు

ఏలూరు టౌన్: ఏలూరు తంగెళ్లమూడి యాదవనగర్‌లోని ఒక ఇంట్లో వృద్ధురాలు మృతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతదేహం నుంచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికుల పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలించి, సుమారు మూడు నెలల కిత్రం మృతిచెంది ఉండవచ్చని ప్రాథమిక అంచనా వేశారు. కుమారుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాలతో డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఏలూరు త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ, టూటౌన్ ఎస్సైలు శుభశేఖర్, సాధిక్ కేసు దర్యాప్తు చేపట్టారు.

ఒంటరిగా జీవిస్తూ

యాదవనగర్ మహిషాసురమర్దిని ఆలయ సమీపంలో శరణార్థి నాగలక్ష్మి (76) తన ఇంటి పైపోర్షన్‌లో నివాసం ఉంటోంది. ఇంటి కింది పోర్షన్‌లో కుమారుడు శరణార్థి దుర్గాబసవ ప్రసాద్, అతని భార్య లలితాదేవి నివాసం ఉంటున్నారు. లలితాదేవి చొదిమెళ్లలో స్కూల్ టీచర్. దుర్గాబసవప్రసాద్ ఖాళీగా ఉంటున్నాడు. నాగలక్ష్మికి ఆమె కుమారుడికి కొంతకాలంగా గొడవల కారణంగా మాటలులేవని చెబుతున్నారు. నాగలక్ష్మి భర్త ప్రభుత్వ ఉద్యోగం చేసి పదవీవిరమణ అనంతరం మరణించటంతో ఆమెకు పెన్షన్ వస్తోంది. ఈ పెన్షన్ సొమ్ముతోనే నాగలక్ష్మి వంటరిగా జీవిస్తోంది.

మృతిపై పలు అనుమానాలు

నాగలక్ష్మి మృతి పలు అనుమానాలకు తావిస్తోంది. నాలుగు నెలల నుంచీ ఆమె మేడపై నుంచి కిందికి దిగలేదని, తమతో మాటలు లేవని కుమారుడు చెబుతున్నాడు. మూడు నెలల క్రితం ఇంటి నుంచి దుర్గంధం వెదజల్లటంతో దుర్గా బసవ ప్రసాద్‌ను అడగగా తమ ఇంట్లో పిల్లి చచ్చిందని, తీస్తామని చెప్పాడని స్థానికులు చెబుతున్నారు. కొద్దిరోజులు దుర్గంధం వెదజల్లగా అనంతరం తగ్గిపోయిందంటున్నారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు. పోలీసులు దుర్గాబసవ ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. బుధవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తామని పోలీసు అధికారులు తెలిపారు.

శ్రీవారి పవిత్రోత్సవాలు ప్రారంభం



స్వామివారి ఉత్సవ మూర్తులతో అర్చక బృందం, ట్రస్టీలు, కార్యనిర్వహణాధికారి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి స్వామి వారి 22వ వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత శ్రీమత్ విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షా బంధన, అంకురార్పణ, దీక్షాధారణ, పవిత్ర అధివాస పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం ముఖ్య అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, కోసూరి సత్యనారాయణాచార్యులు పర్యవేక్షణలో పాంచరాత్రాగమ పండితులు కిళాంబి వేంకట పవన్ కృష్ణామాచార్యులు, యాజ్ఞిక బృందం విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు కిలారపు శ్రీనివాసరావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

30 నుంచి వైద్య శిబిరాలు



ఏలూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, వైద్య సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు ఆరోగ్య పరిస్థితి తెలియజేయాలని ఏలూరు 29వ డివిజన్ ఇన్‌చార్జి సన్నీ చైతన్య కోరారు. ఏలూరు టైటస్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని తాపీమేస్త్రీ కాలనీలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ ఉచితంగా మెరుగైన వైద్య సేవలు, ఆరోగ్యవంతమైన సమాజం కోసం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఇంటింటా సర్వే చేపట్టారని చెప్పారు. సర్వేలో కుటుంబంలోని ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తే, వాటికి అనుగుణంగా ఈనెల 30 నుంచి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. కంటి, దంత సమస్యలు, షుగర్, బీపీ, హిమోగ్లోబిన్, డెంగీ, మలేరియా పరీక్షలు, గర్భిణుల ఆరోగ్య సమస్యలు, వ్యాధి నిరోధక టీకాలు, దీర్ఘకాలిక వ్యాధులు ఇలా అనేక రకాల వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిత, మలేరియా అధికారి గోవిందరావు, ఆరోగ్య కార్యకర్తలు సుహానా, వెంకటలక్ష్మి, బర్రె జ్యోతి, రసూల్, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా, వలంటీర్లు ఉన్నారు.

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేయిస్తోన్న కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్: ఏలూరు నగర పరిశుభ్రతకు నగరపాలక సంస్థ చేపట్టిన స్వచ్ఛత సేవ కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ కోరారు. ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ స్వచ్ఛత లీగ్ కార్యక్రమం చేపట్టారు. ఏలూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచటంలో శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని కార్పొరేషన్ కార్యాలయం వద్ద అధికారులు, సిబ్బంది, కార్మికులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజలు రోడ్లపైనా, డ్రెయినేజీల్లోనూ ఇష్టారాజ్యంగా చెత్త, వ్యర్థాలు వేయకుండా, చెత్త సేకరణ వాహనాలకు అందించాలని కోరారు. రోడ్డు పక్కన చిరు వ్యాపారులు రోడ్లపై వ్యర్థాలు, చెత్త వేయరాదని, నిబంధనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతీ, డీఈ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు పర్యావరణ కార్యదర్శులు, యువత, విద్యార్థులు హాజరయ్యారు.

అంగన్‌వాడీల సమస్యలపై తహసీల్దార్‌కు వినతిపత్రం

భీమడోలు: అంగన్‌వాడీ సిబ్బంది న్యాయమైన కోర్కెలను తీర్చాలని కోరుతూ మంగళవారం భీమడోలు మండల అంగన్‌వాడీ వర్కర్ల, హెల్పర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమడోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసారు. అంగన్‌వాడీ సిబ్బంది జీతాలు పెంచాలని, ఉద్యోగ బాధ్యతలతో సతమతమవుతున్నామని, పనికి తగ్గ వేతనం ఇచ్చి తమను ఆదుకోవాలని వారు కోరారు. వినతి పత్రాన్ని తహసీల్దార్ ఇందిరాగాంధీకి అందజేశారు. నాయకురాలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడిట్ నిర్వహణ ఆన్‌లైన్లో నమోదు చేయాలి

పెదవేగి : ఆడిట్ నిర్వహణ ఆన్‌లైన్లో నమోదు చేయాలని డీఎల్పీఓ కే పూర్ణచంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని సచివాలయాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడిట్ నమోదు ఆన్‌లైన్లో చేయడం వల్ల ప్రభుత్వం నుంచి నిధుల విడుదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన సూచించారు. అక్టోబర్ నెల 31వ తేదీ లోపు అన్ని సచివాలయాల్లో ఆన్‌లైన్ ఆడిట్ నిర్వహణ తప్పనిసరిగా పూర్తి చేయాలని వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీఆర్ మనోజ్, సీనియర్ ఆడిటర్ దిలీప్, ఈఓపీఆర్ డి.శ్రీనివాస్, మండల పరిషత్ ఏవో కె.విక్టర్ జాన్సన్, కార్యదర్శులు ప్రసాద్, రాణి, సాయి కృష్ణ, జితేంద్ర, రామచంద్ర రావు, బాబ్జి, కిషోర్ పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్‌లో ఓబీసీ కోటాపై పోరాడతాం



సమావేశంలో లాకా వెంగళరావు తదితరులుతో కలిసి లక్కోజు గోపి

ఏలూరు (టూటౌన్): మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ కోటా పెట్టకపోవడం విచారకరమని రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించినట్లుగా బీసీలకు కూడా సబ్ కోటా పెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంగం ఏలూరు అర్బన్ అధ్యక్షులు లక్కోజు రాజగోపాలాచారి అన్నారు. సంఘం రాష్ట్ర సమావేశం మంగళవారం విజయవాడలో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు, మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మలతో పాటు ఏలూరు అర్బన్ అధ్యక్షులు లక్కోజు గోపి పాల్గొన్నారు. సమావేశం వివరాలను స్థానిక విలేకరులకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారు తప్ప వారి హక్కులను కాపాడటం లేదన్నారు. రాబోయే రోజుల్లో చట్టసభల్లో సబ్ కోటా ఏర్పాటు చేయకపోతే బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామన్నారు. ఒక బీసీ అయిన ప్రధాని మోదీ మహిళా బిల్లులో బీసీలకు అన్యాయం చేశారన్నారు. అగ్రకులాలు అడగకుండానే 10 శాతం రిజర్వేషన్ ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేసారు. బీసీ మహిళా రిజర్వేషన్ కోసం మరో పోరాటం చేస్తామని, సబ్ కోటా సాధించే వరకూ తమ ఉద్యమం ఆపే ప్రసక్తి లేదన్నారు. నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు కింజం గిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	31
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

చంద్రబాబు హయాం అవినీతిమయం

- ఫైబర్ గ్రిడ్‌లో అవినీతి ఆశ్చర్యపరిచింది
- అసెంబ్లీలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఒకపక్క చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1 వంటి అద్భుతాలతో మన దేశం అంతర్జాతీయ ఖ్యాతి గడిస్తున్న తరుణంలో చంద్రబాబు హయాంలో జరిగిన స్కామ్‌లు రోజుకొకటి బయటపడుతున్నాయని, దీంతో ప్రజలు నివ్వెరపోతున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ప్రతి పథకాన్ని అవినీతిమయంగా మార్చారన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్ల సీఎం అనుభవాలను స్కామ్‌లు చేయడానికి వాడినట్టు తెలుస్తోందని చెప్పారు. ఫైబర్ గ్రిడ్ స్కామ్‌ను చూస్తే ఇది నిజమని అనిపిస్తోందన్నారు. ఫైబర్ గ్రిడ్‌లో ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ వేస్తూ పేదలకు అత్యాధునిక సాంకేతికత సాయంతో టీవీ, కంప్యూటర్, టెలిఫోన్ వంటి సౌకర్యాలు అందించడం లక్ష్యమని, ఈ టెండర్‌లో ఐదు కంపెనీలు పాల్గొంటే టెరా సాఫ్ట్ కంపెనీని మాత్రమే ఎంపిక చేశారని వివరించారు. ఇది గతంలో పౌర సరఫరాల శాఖకు నాసిరకం సరుకు సరఫరా చేసి బ్లాక్ లిస్ట్ అయిన కంపెనీ అని చెప్పారు. ఆ కంపెనీ ఎండీ వేమూరి హరిప్రసాద్ ఈవీఎం దొంగతనం కేసులో ప్రధాన ముద్దాయి అని వివరించారు. అసలు టెండర్‌లో పాల్గొనడానికి అర్హత లేని కంపెనీని టెండర్ గ్రిడ్ ఓపెన్ చేసే ముందురోజు బ్లాక్ లిస్టులోంచి చంద్రబాబు తీయించారన్నారు. ఆ కంపెనీ అందించిన డాక్యుమెంట్లు కల్పితమైనవని, అర్హతలు సరైనవి కావని చెప్పి నివేదిక ఇచ్చిన ఉన్నతాధికారి సుందర్‌ను వెంటనే బదిలీ చేయించారని చెప్పారు. వేమూరి ప్రసాద్ అనే వ్యక్తిని టెక్నికల్ కమిటీ, టెండర్ ఎవాల్యుయేషన్ కమిటీలోనూ చంద్రబాబు నియమించారన్నారు. ఇలాంటి కంపెనీకి రూ.284 కోట్లు ఇచ్చి పని చేయిస్తే నాణ్యత ఎక్కడ ఉంటుందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఈ పనుల్లో నిర్దిష్టమైన లెక్క ప్రకారం స్తంభాలు పాతకుండా టెండర్లలో పేర్కొన్న కేబుళ్లు, పరికరాలు పెట్టకుండా రూ.114 కోట్ల ప్రజల సొమ్ము దుర్వినియోగం చేసినట్టు తేలిందన్నారు. ఫైబర్ గ్రిడ్ స్కామ్ మొదటి నుంచి మోసమేనని, తప్పకుండా దర్యాప్తు సంస్థలు విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటాయని తెలిపారు. ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టును చంద్రబాబు సుపుత్రుడు లోకేశ్ అవినీతి గ్రిడ్‌గా మార్చేశారన్నారు. ఫైబర్ గ్రిడ్‌లో జరిగిన మోసాలకు ఇది ట్రయల్ మాత్రమేనని, ఇంకా సంచలన నిజాలు బయటకు వస్తాయని స్పష్టం చేశారు. లోకేశ్ స్టాన్‌ఫోర్డ్‌లో చదివి దొంగ ఒప్పందాలు ఎలా చేయాలి, నిధులు ఎలా కొట్టేయాలి, షెల్ కంపెనీలు ఎలా పెట్టాలి, ఒక కంపెనీని బ్లాక్ లిస్టులో ఎలా పెట్టాలి, అందులో నుంచి బయటకు ఎలా తీసుకురావాలి అన్నది మాత్రమే నేర్చుకున్నాడని ఎమ్మెల్యే కొఠారు అన్నారు.